# రోగం కుదిరింది

రచన: పి. నరసింగరావు



మండుటెండలోవుండే ఉడిగీధూళితో సహా రేగుతున్న వేడిగాలిలో బంట్రోతు వెంకన్న బెడ్డింగుతోనూ, ఎవరో వద్దంటున్నా వినకుండా యిచ్చిన మామిడిపళ్ల బుట్టతోనూ వెంటరాగా నాలుగైదు మైళ్ళు నాట్రుత్రోవన, ఎత్తుపల్లాలలో పాలాల గట్లమీద నడచి, అలసి సొలసి ముఖంమీది చెమటను మాటిమాటికి చేతిరుమాలుతో తుడుచుకుంటూ హేటూసూటులో ముప్ఫైవిళ్లు పైబడ్డ సీనియర్ కో అపరేటివ్ ఇనస్పెక్టరు కృష్ణమూర్తి రోడ్డుచేరేసరికి పదకొండు గంటలైంది.

సుమారు ఒక గంట రోడ్డుప్రక్కన మామిడిచెట్టునీడలో నిరీక్షించగా వచ్చిన బస్సులో జాగాలేక బాగా రద్దీగావున్నా తన పలుకుబడితో అతికష్టంమీద జాగా సంపాదించి, బంట్రోతుతో సహా కూర్చున్నాడు.

ప్రాణం కుదుటపడింది. ఇంకేముంది! మరో గంటకల్లా యిల్లుచేరి, స్నానంచేసి భోజనానంతరం, అర్ధాంగి సత్యభామను కౌగిలిలో చేర్చుకొని హాయిగా సుఖపడవచ్చనుకున్నాడు.

బస్టాండులో దిగగానే కొత్త అగ్రహారంలోవున్న తన యింటి ఆనవాళ్లు చెప్పి బేరమాడుకుని, తన శెలవుకై నిరీక్షిస్తున్న వెంకన్నకు బుట్టలోని కొన్ని మామిడిపళ్లు యిచ్చి రిక్షాను పోనియ్యమన్నాడు.

ఇల్లుచేరేసరికి తల్లి వెంకమ్మ వరండాలో కూర్చొని తదేకదీక్షగా భాగవతం చదువుకొంటూంది. పిల్లలు లక్ష్మి గోపాల్ బిక్క ముఖాలతో బుద్ధిగా కూర్చున్నారు.

ఇల్లాలు సత్య ఒంటరిగా పడకగదిలో మంచంమీద పడుకుని తన రాకను గుర్తించికూడా లేవకుండా ఏదో పత్రిక చదువుకొంటోంది.

ఇంట్లో ఎవరిమట్టుకువాళ్ళు విడివిడిగా ఒకరితో ఒకరికి సంబంధం లేనట్లు కూర్చోవడంనుంచీ, పైగా తను వారంరోజుల తరువాత కేంపు నుంచి వచ్చినా ఎవరూ పలుకరించకపోవడంనుంచీ, అంతకుముందు ఏదో ప్రళయం సంభవించేవుంటుందని తేలిగ్గాఊహించగల్గేడు ఇంతకూ ఇలాంటి గాలివానలూ పెనుతుఫానులు తన సంసారంలో కొత్తగనుకనా ?

ప్రకృతికూడా అంతే! పెనుతుఫానుతో అల్లకల్లోలమై, నానాభీభత్సమైన తరువాత ఒక్కసారి నిస్తబ్ధత అవరిస్తుంది!

బట్టలు మార్చుకుంటూనే "మళ్ళీ ఏమొచ్చింది?" అన్నాడు విసుగ్గా!

"ఆ...ఏమొస్తుంది ? ... ఎప్పుడూ ఉన్నదే! ఆమెనే అడగండి" అంది సత్య.

ఆమె మాటల్లో ద్వేషం, ఈర్ష్య, పగ, ప్రతిధ్వనిస్తున్నాయి.

"ఈ జన్మకింతే మీ తగవులు తీర్చడంతోనే నా బ్రతుకు తెల్లారిపోతుంది" అని ఆమె సమాధానానికై ఎదురు చూడకుండానే తువ్వాలు తీసుకుని స్నానానికై విసురుగా వెళ్లిపోయాడు.

స్నానం చేసివచ్చిన తరువాత తెలిసింది ఇంకా అంతవరకూ వంటకాలేదని. పిల్లలతోసహా అందరూ పస్తులున్నారనీ.

అతనిలో సహనం నశించింది, ఒళ్లు మండింది.

"అయితే మీ ఇద్దరి తగవులతోనూ పంతాలతోనూ, ఆ పసిపిల్లలను తిండి పెట్టకుండా చంపేస్తారా?" అన్నాడు కోపంగా.

"ఇది మరీ బాగుంది. ఎదురుగుండా ఉన్నవాళ్ళను విన్నెమ్మ కొట్టిందట! ఆమెను ఏమీ అనలేక మధ్య నన్ను సాధిస్తారేమిటి?" అంది సత్య నిర్లక్ష్యంగా. తప్పు తనది కానట్లూ తనకేమీ బాధ్యతలేనట్లూ.

వరండాలోకివెళ్లి "ఏమమ్మా దానికి లేకపోతే పెద్దదానివి నీకైనా ఉండొద్దూ? ఇద్దరూ కలిసి పిల్లలను పస్తుపడుకోబెడతారా? ఛీ!...ఛీ!..." అన్నాడు అసహ్యంతో.

"అసరా నాయినా బాగా అను. మీ చేత మాటలుపడడానికే బ్రతికి వున్నా. ఇంతకూ పిల్లలమీద కన్నతల్లికిలేని జాలి, అభిమానం, అపేక్ష మధ్య నా

కెందుకు?" అంది వెంకమ్మ కళ్లనీరు నింపుకుంటూ...

కృష్ణమూర్తి ఇరుకునపడ్డాడు. ఇటు నవమాసాలూ మోసి కని పెంచి పెద్ద చేసిన కన్నతల్లినీ అనలేక, అటు ఏరి కోరి చేసుకున్న ఇల్లాలిని అంతకన్నా ఏమీ అనలేక దాగట్లోపడ్డ వెలంకాయిలా సంసారంమీద విరక్తితో బాధగా "ఐదేళ్లనుంచీచూస్తున్నా,నయానా, భయానా చెపుతున్నా, ఎప్పటికైనా మీకు బుద్ధి రాకపోతుందా అని. కాని ఇక భరించలేను. సన్యాసం పుచ్చుకుని ఈ నరకం నుండి బయటపడతా" అని నిస్సయంగా వాలుకుర్చీలో కూలబడ్డాడు.

ఏమనుకున్నారో ఏమో గాని అత్తా కోడళ్ళూ ఒకరితో ఒకరు మాట్లాడుకోకపోయినా మౌనంగానే ఇద్దరూ ఏకమై గబగబా ఒక గంటలో వంట పూర్తి చేశారు.

భోజనాలయ్యేసరికి రెండున్నర దాటింది.

మేడమీద గదిలో ఒంటరిగా ఆలోచిస్తున్న కృష్ణమూర్తి ఆత్యాకర్షణీయంగా అలంకరించుకుని సత్య వచ్చేసరికి తన కోపాన్నంతా మరచిపోయేడు. ఇద్దరు పిల్లల తల్లైనా సత్య సౌందర్యం, శరీర సౌష్టవం ఏమీ చెక్కుచెదరలేదు అవయవాలబింకం సడలలేదు. ఆమె నిత్య యవ్వని.

"పిల్లలూ, అమ్మా లేరా?" అన్నాడు తియ్యగా చూస్తూ.

"మీ తమ్ముడు గారింటికి వెళ్లేరు సాయింత్రందాకా రారు!"

"అయితే మనం ఇద్దరమే నన్నమాట" అని నవ్వుతూ ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

అతని పట్టు విడిపించుకుంటూ "ఎందుకూ సన్యాసం పుచ్చుకుంటానన్నారుకదూ?" అంది కంటతడితో.


కృష్ణమూర్తి కాస్త నొచ్చుకుంటూ "ఇప్పుడవన్నీ ఎందుకులే" అంటూ ఆప్యాయంగా ఆమెను కౌగిలిలో ఇముడ్చుకొని ఇద్దరూ ఏకమైపోయారు.

* * *

వారం పదిరోజులు సాఫీగానే వెళ్ళిపోయాయి. కాని ఆనాడు సాయంత్రం ఐదు గంటలకల్లా ఆఫీసు వదలి కృష్ణమూర్తి ఇంటికివచ్చేసరికి మళ్లీ ఇంట్లో పెద్ద గొడవ జరుగుతూంది.

కృష్ణా, రామా అని ఓమూల పడివుండక తగుదునమ్మా అని అయినదానికి, కాని దానికీ కలుగజేసుకుని మధ్య ఈవిడ గారి అజమాయిషీ పెత్తనం ఏమిటో? అంది సత్య చేతులు తిప్పుకుంటూ తనేమీ ఆమెకు తీసిపోనట్లు.

కృష్ణమూర్తికి ఎన్నడూ రానంత కోపం వచ్చింది. అసలు అతనికి తగువు ఎందుకువచ్చిందో అడిగి తెలుసుకుందామనిపించలేదు. అంత ఓపికా లేదు.



ఇరుగు పొరుగు ఆడవాళ్లూ పిల్లలూ ఎవరిగుమ్మాలలో వాళ్లు నిలబడి ఆ తగువును విని ఆనందిస్తున్నారు.

కృష్ణమూర్తికి సిగ్గుతో తలకొట్టినంత పనైంది.

ఇంట్లోకి వెళ్ళి సైకిలు గోడకు జేరవేశాడో లేదో "వినరా నాయినా ఎంతం తేసి మాటలంటుందో! నేను ఈయింటికి శనిగ్రహాన్నిట. నా పీడ విరగడైనదాకా ఈ యిల్లు బాగుపడదట" అంది ముక్కు చీదుకుంటూ వెంకమ్మ.

"అనవసరంగా నోటికి వచ్చినట్టల్లా తిడితే నేనుమాత్రం ఊరుకుంటానా? ఎందుచేతనంటే కారణం సామాన్యమైనదే అయివుంటుందని అతనికి బాగా తెలుసు. ఏ కూర వొండాలన్నవిషయంలోనో వంటిల్లు శుభ్రంగా కడుగలేదనో, పిల్లలు మడిబట్టముట్టుకున్నారనో ఏదో ఇలాంటి విషయమే అయివుంటుంది.

అంచేత గుడ్లెర్రచేసి "నోరుమూస్తారా ముయ్యరా?" అని ఒక్కసారి ఇద్దరినీ అదిలించేడు.

అతనిమాటలు పిడుగుల్లా ధ్వనించేయి.

సత్య కొద్దిగాజంకినా, పైకి బింకంగా "ముందు ఆమె నోరు మూయించండి" అంది.

.ఆ... ఇద్దరినోర్లూ మూయిస్తా"

ల్లున ఓ లెంపకాయి కొట్టేడు.

న్నడూ అలాంటిది తిని ఉండక వడంనుంచి కాబోలు సత్యకు మొహం తిరిగినంతపనైంది. కట్టలు తెంచుకుని వస్తున్న శోకపుతెరలనుదిగమింగి మాట్లాడితే మళ్లీ మరొకటి తగులుతుందేమో అన్న భయంతో నోరు మూసుకుని కూర్చుంది.

"అయ్యో దాన్ని అలా కొట్టకురా నాయినా! ఆ తరువాత నేను కొట్టించానంటుంది" అంది కోడలికైన శాస్తికి లోలోన సంతోషపడుతూ వెంకమ్మ.

భార్యను కొట్టినందుకు లోలోన బాధ పడుతున్న కృష్ణమూర్తికి ఈ మాటల ధోరణి అసహ్యమనిపించి "నోర్మూయ్యి లేకపోతే నీకూ ఒకటి తగిలిస్తా" అని అనేసరికి వెంకమ్మ అక్కడినుంచి కదలి దేముడిగదిలోకి వెళ్లిపోయింది.

కృష్ణమూర్తి ఆలోచనలో పడ్డాడు. సత్య తనకు అన్నివిధాలా అనుకూలమైన భార్య. ఇక రాబడికా ఏ లోటూ లేదు. కాని ఐదు సంవత్సరాలై కాపురం చేస్తున్నా అత్తా కోడళ్లకు సరిపోవడం లేదు. వెధవది సర్కసులో క్రూర జంతువులనుకూడా మచ్చికచేసి కొంత కాలానికి తమయిష్టంవచ్చినట్లు తిప్పుకోగలుగుతున్నారు. అలాంటిది వీళ్లిద్దరికీ బుద్ధిచెప్పడమెలాగా అని ఆలోచించ సాగేడు.

ఇంతలో తనకు ప్రాణస్నేహితుడైన హెడ్‌గుమాస్తా రామనాథం రాగా అతనితో కలిసి షికారుకు వెళ్లిపోయాడు.

ఆ మర్నాడు సత్య అలిగి పిల్లలతో సహా పుట్టింటికి బయలుదేరింది. సరే నాలుగురోజులు ఎడంగావుంటే అందరికీ మనశ్శాంతి లభిస్తుందనే ఉద్దేశంతో కృష్ణమూర్తి కూడా వద్దనలేదు.

భర్తకు పక్షవాతం వచ్చిందని టెలిగ్రామ్ వచ్చేసరికి సత్యభామకు కాళ్ళూ చేతులూ వణికి మొహం తిరిగినంత పనైంది.

తండ్రితో కలిసి మెయిల్లో బయలుదేరి అనకాపల్లి వచ్చింది.

ఇంటికివచ్చి మంచం మీద పడివున్న భర్తనుచూచేసరికి భోరున వెక్కి వెక్కి యేడ్చింది.

కృష్ణారావు స్పృహతోవున్న ఒక కాలూ చెయ్యీమాత్రం కదపలేకపోతున్నాడు. ఆ సమయానికి డాక్టరుగారూ, హెడ్‌గుమాస్తా రామనాథం కూడా వున్నారు.

"అయితే బాబూ మరేం ప్రమాదం లేదు కదా?" అన్నారు కృష్ణమూర్తి మామగారు ఆందోళనగా.

"చూడండి! విపరీతమైన మానసికాందోళనకు గురికావడంనుంచీ, శాంతి సౌఖ్యాలకు దూరంకావడంనుంచీ, తీవ్రమైన నరాల దౌర్బల్యానికి లోనై పక్షవాతం వచ్చింది. ఫరవాలేదు గట్టి మందులే వాడుతున్నా" అని చెప్పి డాక్టరుగారు వెళ్లిపోయారు.

వంటింట్లోకి వెళ్ళి సత్య యేడుస్తూ రామనాథంభార్యతో "చూడండి ఆమహాతల్లే ఒక్క క్షణమైనా అయనకు శాంతి లేకుండా వేధించి, విసిగించి, కొసకు ఈ దుస్థితికి తెచ్చింది. ఇక నా గతేం కాను?" అని వెక్కివెక్కి యేడుస్తుంది.

వెంకమ్మకూడ అందుకని "నాయినా రామనాథం, అది కోడలుకాదు, వాడి పాలిటి మృత్యుదేవత. అబ్బబ్బ ఎంత చిత్రక్షోభపెట్టింది. దాన్నుంచే వాడు మంచంపట్టేడు!!!" అంది.

రామనాథం ఇద్దరినీ దగ్గరకు పిలిచి "చూడండి రెండు చేతులూ కలిస్తేగాని చప్పుడు కాదంటారు. అసలు వాడిలా అవడానికి మీ ఇద్దరితగవులే కారణం" అన్నాడు ఇద్దరినీ తీవ్రంగా విమర్శిస్తూ.

అత్తాకోడళ్ళూ ఒకరిముఖాలూఒకరు చూచుకున్నారు.

కృష్ణమూర్తి మామగారు అందుకుని "ఔన్రా! తినివుండలేక ఏమిటా పొగరు? అత్తాకోడళ్ళ మధ్య మన స్పర్ధలూ ఏదో కొత్తలో అంటే అర్థముంది కాని కలకాలంనా? లెంపలు వేసుకుని ఇకమీదనైనా కలిసి మెలిసి వుంటామని ఆ భగవంతుని ముందు ప్రమాణం చెయ్యండి" అని గట్టిగా కేకలువేశారు అత్తాకోడళ్లలో ఆ క్షణాన నిజమైన పరివర్తన కలిగింది. అర్థంలేని తమ తగవులవలన ఎన్ని అనర్థాలో గుర్తించి భగవంతుని ముందు పశ్చాత్తాపంతో లెంపలు వేసుకున్నారు. ఇద్దరి మనస్సులు ఏకమయ్యాయి.

* * *

కృష్ణమూర్తి ఎవరూ లేకుండాచూసి "ఏమయ్యా రెండు రోజులై పస్తులుంటున్నా కడుపు మాడిపోతోంది అన్నం పెట్టించు" అన్నాడు.

"అబ్బ ఎవరైనా వినగలరు మెల్లగా. ఇంతకూ రోగం కుదిరిందిగా! డాక్టరుగారితో చెప్పి రేపు పత్యానికి ఏర్పాటు చేస్తా. హాయిగా మరో పదిరోజులు నీరసాన్ని నటిస్తూ రెస్టు తీసుకో" అన్నాడు రామనాథం నవ్వుతూ విజయగర్వంతో.

కృష్ణమూర్తి కళ్ళు కృతజ్ఞతతో మెరిసాయి. రామనాథం రెండు చేతులూ ఆప్యాయంగా తన చేతుల్లోకి తీసుకున్నాడు.

★